# అసలు కథ

**వాళ్ళింటి అరుగుమీద కూర్చున్న చింతావెంకటకృష్ణారెడ్డి దారమ్మటెళ్తున్న నన్ను కేకేసి "పున్నమినాడు మా తోటలో పార్టీ మోపు చేసుకుందామనుకుంటున్నాం, పార్టీ అంటే గోపాల్రావు హొటేల్లో మైసూరుపాకం ముక్కా కారప్పూస సీనారేకు పళ్ళెంలో పెట్టి తినేశాకా టీ ఇవ్వడం అనుకోకు. మూడు మేకపోతుల్నేసి మన కిళ్ళీరన్నతో పలావు వండిస్తున్నాం. ఇంకా బ్రాందీకాయలూ అయ్యిఉంటాయి. అసలు పాయింటు మర్చిపోయేను! చాన్నాళ్ళకి భోగంమేళం వస్తుంది మనూరు. పెద్దాపురంనించీ మురమండనించీ రాజమండ్రినుంచీ పిలపిస్తున్నాం జనాన్ని. మనం బాగా తెల్సుగాబట్టి మానేపల్లివరం కొంతమందిని పంపిస్తానంది. సరే ఖర్చులకి మనూళ్ళో ఎవడి స్తోమతుని బట్టి ఆడి దగ్గర వసూలు చేస్తున్నాం. నీ వాటాకి ఓ వంద రాసుకోమంటావేంటి?" అన్నారు.**

నేను జేబులోంచి తీసేలోగా "నా పేర్న ఒక వెయ్యి రాసుకోండి" అన్నమాట వినపడి అంతా అటుపక్కకి తిరిగేం. వయసు అరవై పైనుంటది. మాంచి రంగు ఎత్తుగా బలంగా వయసులో ఇంకా బాగుండేవాడనిపించేలా ఉన్నాడు. అతన్ది మా ఊరుగాదు కాలవ దగ్గర వాడ్రేవు రత్నేశ్వర్రావుగారి బంధువట. పది రోజుల్నించి ఊళ్ళో తిరుగుతున్నాడు. ఎక్కడెక్కడో ఉజ్జోగాలు చేసేడంట. చివర్రోజులు మా ఊళ్ళో గడుపుదావని దిగేడంట.

డబ్బు తీసుకుంటూ "మీ పేరేంటండి" అడిగేడు వెంకట క్రిష్ణగారు.

"ఎస్. మాధవరావు" అన్నాడు.

"పార్టీ కార్తీక పున్నమి అంటే ఈ నెలాఖరునన్న మాటండి... డబ్బులిచ్చేసి వెళ్ళిపోతే గాదు... మీరు ఇదాయకంగా రావాలండోయ్" అన్నాడు వెంకటక్రిష్ణగారు.

"అలాగే పౌర్ణమి ఇంకా మూడు వారాలుందన్నమాట". అని లెక్కెట్టుకుంటా చురుగ్గా నడుచుకుంటా వెళ్తున్న మాధవరావుని చూసి ఈ వయసులో ఇంత హుషారుగా ఎలా ఉంటన్నాడీయన అనుకున్నాడు వెంకటక్రిష్ణారెడ్డి.

తెల్లవారుఝామున జాగింగ్ డ్రస్ వేసుకుని పుంతరేవు దాటేదాకా జాగింగ్ చేసి వస్తుంటే వాళ్ళ షెడ్ దగ్గర నిలబడి నేపాళప్పుల్లతో పళ్ళు తోముకుంటున్న ఈగల బుల్లియ్య మతి పోయినట్టు చూస్తున్నాడు. వాళ్ళ హోటల్లో కూర్చుని వేడి ఇడ్డెన్లు పచ్చి తామరాకుల్లో పొట్లం కడ్తున్న భారీ కాయగల గోపాలరావు ఇతన్లా నేను పరిగెట్టగలిగితే ఎంత బావుండ్ను అనుకున్నాడు. రామచంద్రపురం వెళ్దామని బుల్లెట్టుబండి బయటికి తీస్తున్న చింతావెంకటకిష్ణగార్ని దాటుకంటా వెళ్తున్న మాధవరావుని చూసి అప్పుడనుకున్నాడు ఇతనింత చెలాగ్గా ఉండడానికి కారణం ఇదన్నమాట అని.

* * *

నల్లకాంతమ్మగారింటి కెదురుగా పాడయిపోయిన పెద్ద ఇల్లుంది. సగానికి పైగా పడిపోయున్న ఆ ఇంటిని కరణాల గోడలు అని పిలుస్తారంతా. అది రత్నేశ్వర్రావుగారిల్లు. మాధవరావు మకాం ఆ ఇంట్లో పెట్టాడు. పగలంతా కాలవ దగ్గరున్న గుడ్డిపట్టాభి కిళ్ళీకొట్టు దగ్గరా వంతెన దిగువనున్న చింతావారి కాఫీ హోటేలు దగ్గరా గడుపుతున్నాడు. పొద్దోయేసరికి ఫలానావాళ్ళు అని వయసు తారతమ్యం



లేకుండా ఇద్దరు ముగ్గుర్ని పోగేసి తను దిగిన ఆ పాడయిపోయిన ఇంట్లోకి తీసుకెళ్తున్నాడు.

మాధవరావు మాంచి వంటగాడు. అంతే గాకండా బియ్యం పులచబెట్టి సారా భలేగా తయారు చేస్తాడు. అది తాగితే భలే నిషాలే.

అతని దగ్గర సైగలూ, టంగుటూరి సూర్యకుమారిలాంటి పాతవాళ్ళ లక్కరికార్డులున్నాయి. గ్రిండిగ్ స్పూల్ టేప్‌రికార్డర్ ఒకటుంది. పొద్దోయేకా ఆన్ చేస్తుంటే రకరకాల భాషల్లో పాటల్తో పాటు రకరకాల ఆడవాళ్ళు రకరకాల భాషల్లో మాటాడే మాటలు వినబడ్తుంటాయి.

* * *

ఊళ్ళో మాధవరావుగురించి స్టోరీలు రకరకాలుగా వినబడ్తున్నాయి.

కర్రిసుబ్బిరెడ్డిగారింట్లో వంటలు చేసే క్రిష్ణ మిషనుకుట్టు వెంకారెడ్డిగారి సుందరయ్య ఇంకొంత మందీ గల్సి చిన్న మీటింగెట్టుకుని



గుడ్డి పట్టాభి నేసుకుని మాధవరావున్న ఇంటికి బయల్దేరెళ్ళారు ఆ రాత్రిపూట.

ఆ గుంపుని చూసిన మాధవరావు ఎదురొచ్చి మరీ తీసుకెళ్ళిపోయేడు లోపలికి. "ఈ రాత్రి మీకు పచ్చిరెయ్యిల పలావు చేసి పెడతాను. రెడ్‌వైన్ తయారు చేసేను, ఒకసారి రుచి చూస్తే రోజూ కావాలంటారు" అన్నాడు. ఎవరూ మాటాడలేదు. అతనేంటంటే అది విన్నారు. అతనేం చెపితే అది చేసేరు.

మూడు నాలుగు రౌండ్లు అయ్యాకా స్పూల్ టేప్ రికార్డర్లో బెంగాలీ పాటలు వింటున్న మాధవరావుతో "ఇవేంటో గందరగోళంగా ఉన్నాయి ఇంకా ఏవన్నా పెట్టండి వింటాం" అన్నాడు సుందరయ్య.

ఆ స్పూల్ మార్చి ఇంకోటి పెట్టి ఆన్ చేశాడు. కాస్సేపటికి మత్తు మత్తుగా మాటాడ్తున్న అమ్మాయి గొంతు వినిపిస్తుంది. ఆ భాష

మా పసలపూడిలో మాటాడుకునే తెలుగు కాదు అదేదో. "ఏంటండి బాబూ కీసర బీసర మంటాను" అన్నాడు గుడ్డిపట్టాభి.

అప్పటికి బాగా ఎక్కింది మాధవరావుకి. "ఆ ఆడమనిషి మాటాడే భాషేంటో తెల్సా ఫ్రెంచ్" అన్నాడు.

"ఫ్రెంచేంటండి బాబూ సత్తార్ సైకిలు షాపులో రెంచిలాగ" అన్నాడు వంటల క్రిష్ణ.

నవ్వుతా చెప్పడం మొదలెట్టాడు. "చాలా ఏళ్ళ క్రితం నేను కర్నాటక రాష్ట్రంలో హసన్ అనే టౌన్లో ఒక టూరిస్ట్ హోటల్లో పని చేసేవాడ్ని". "ఏం చేసేవోరూ మేనేజరా?" అడిగాడు గుడ్డిపట్టాభి.

నవ్విన మాధవరావు 'నేనేం జేసేనన్నా మీరు నమ్ముతారు. నిజం చెప్పాలంటే నేను చేసింది రూమ్ బాయ్ పని" అన్నాడు.

"హలిబేడు, బేలూరు చూడ్డానికి ఫారినర్సు బాగా దిగేవారు ఆ హోటల్లోకి ఒకసారి ఫ్రెంచ్ గ్రూపు దిగింది. వాళ్ళలో ఒకావిడగారు నన్ను చూసిన వెంటనే వాళ్ళ మనుషులకేం చెప్పిందో తెలీదుగానీ వాళ్ళు మా మేనేజర్‌కి ఫోన్ చేసి ఏం మాటాడారో తెల్సా?".

"ఏం మాటాడేరు?" ఆత్రంగా అడిగాడు సుందరయ్య.

'మేమిక్కడున్నంత కాలం ఇతనే ఉండాలని కండిషన్ పెట్టింది" అని ఆగిన మాధవరావు మొకం రామచంద్రపురం మున్సిపల్ పార్క్‌లో మెర్క్యురీ బల్బులా వెలిగిపోయింది. కాస్సేపయ్యాకా ఏం మాట్లాడకండా ఉండిపోయేసరికి టెన్షను పెరిగిపోయింది అందర్లో. "ఆ తర్వాతేం జరిగిందో చెప్పరేంటి?" అన్నారు.

నవ్వుతూ "ఆ తర్వాతేం జరిగిందో నేను చెప్పనుగానీ సంవత్సరం తర్వాత తను నాకో ఉత్తరం రాసింది. అందులో మేటరేంటో చెపుతాను" అనడంతో అతనికి దడి కట్టేసి "ఏంటి?" అన్నారు.

"తనకి పుట్టిన బిడ్డ పోలికలన్నీ నావేనట. వాడికి నా పేరే పెట్టుకుందట" అని తలెత్తి ఆకాశంలోకి "ఇది ఎన్నేళ్ళ క్రితం మాట"అన్నాడు.

మా వాళ్ళంతా విప్పిన నోళ్ళు చాలా సేపటిదాకా మూసుకోలేదు.

* * *

మాధవరావు చెప్పేవాటిలో ఎలాంటి పొల్లూ లేదనిపిస్తుంది. అతనికి చాలా నాలెడ్జి ఉందని ముఖ్యంగా ఆడాళ్ళతో అతనికున్న అనుభవాలు కోకొల్లలని ప్రచారమై పోయింది ఊరంతా.

దాంతో ఊళ్ళో వాళ్ళంతా అతనెప్పుడు పార్టీకి పిలుస్తాడా అని ఎదురుచూడ్డం మొదలెట్టారు.

మూడోరౌండ్ తర్వాతే నోరు విప్పే అతను ఎన్నెన్నో విషయాలు చెప్తున్నాడు. అన్నింటి కంటే అతి ముఖ్యంగా జెప్పాల్సిందేంటంటే ఎందరో అందగత్తెలు అతని కింద బానిసలై సుఖపడ్డారు.

ఆరోజు ఓ కథ చెప్పేడు.

వాల్తేరు నించి కిరండోలు రైలు మార్గం ఏస్తున్న రోజులవి. నేను కాంట్రాక్టరు శుభాకర్రావుగారి దగ్గర పని చేస్తుండేవాడ్ని. మా మకాం అరకులో. ఆ రోజుల్లో ఎండాకాలం కూడా రగ్గులు కప్పుకు పడుకోవాల్సి వచ్చేది అంత చలన్నమాట. గెస్టహౌసులూ హోటళ్ళూ ఉండేవి కాదు. విజయనగరం నించొచ్చిన మీసాలరాజుగారు అక్కడ చిన్న పాక వేసుకుని హోటలు పెట్టాడు. కొండోళ్ళతో అడివికోళ్ళని, గొర్రెల్నీ కొట్టించి వంటలు చేసిపెట్టేవాడు మాకు. ఆ మాంసం కూరల రుచి మామూలు రుచిగాదు మా గొప్ప రుచిలే ఏరోజుకారోజు ఆ వండే మనిషెవరో రాజుగార్ని అడిగితే "మా బంధువుల పిల్లలే" అనేవాడు ఓసారి చూస్తానంటే "దాంతో నీకేంపన్రా" అనేవాడు. పాక లోపల

కాళ్ళమువ్వల పట్టాల చప్పుళ్ళు మట్టిగాజుల గకగకలూ తప్ప మనిషి కనిపించేది కాదు. దాంతో నేను ఎర్రోణ్ణయిపోయేవాడ్ని. ఆ మనిషిని చూసి తీరాలని ప్రతీరోజూ ప్రయత్నం చేసేవాడ్ని.

ఒకరోజు అరకు సంతలో ఎర్రచీర కట్టుకుని వెళ్ళిపోతున్న ఆడమనిషి కనిపించింది. కాళ్ళ పట్టాల చప్పుడు విని గుర్తు పట్టి ఎదురెళ్ళాను. నవ్విన ఆ మనిషి "మా మాయ్యని నా గురించి రోజూ అడగడం వింటన్నాను" అంది తన పేరు వరాలమ్మట.

మాటాడిన కాస్సేపటికి ఆ మనిషి నా సొంతం అనిపించేసింది. ఈలోనా చీకటి పడ్డంతో మరి వెళ్తాను అని ముందుకి అడుగెయ్యబోతుంటే ఆపి "మళ్ళీ ఎప్పుడు?" అన్నాను.

"రేపు మధ్యాన్నం పానిరంగిని దగ్గర పనసచెట్లగుంపుంది చూడు అక్కడుంటాను. రాత్రుళ్ళు మా మాయ్యతో కుదరదు" అనేసెళ్ళిపోయింది.

మర్నాడు సరిగ్గా మధ్యాన్నం పూట. శీతాకాలంగాలికి పగలే చలిపెడ్తుంది. జనమెవ్వరూ లేరు. నెమ్మదిగా నడుచుకుంటా పానిరంగిని దగ్గర ముసలి పనసచెట్ల దగ్గరకెళ్ళాను.

పగలే చీకటిగా ఉందక్కడ అడుగులో అడుగేస్తుంటే జారి కాలికింద నలుగుతున్న ఎండు పనసాకులు చప్పుళ్ళు చేస్తున్నాయి.

వరాలమ్మని వెతుక్కుంటా వెళ్తుంటే "ఇక్కడండీ" అన్న సన్నటి గొంతు వినిపిస్తే ఆగాను. అన్నం కేరేజీతో నిలబడుంది వరం.

కేరేజి విప్పబోతుండగా అలికిడయింది. చూస్తే గిరిజనుల గుంపు. పెద్ద పెద్ద కర్రల్తోనూ కత్తులు తోనూ పనసకాయలు కోసుకోడానికొస్తున్నారు. బెదిరిపోయిన వరాలమ్మ తెచ్చిన కేరేజి విప్పకండానే పట్టుకుని పారిపోయింది.

ఆ తర్వాత పద్మాపురం తోటల్లోనూ, అంజోడా దగ్గర మర్రిచెట్టు కిందా, బుర్రాగుహ ల్లోనూ, కరకవలస జలపాతాల కిందా ఇలా ఆ దండకారణ్యంలో పట్టపగలే కటిక చీకటిగా ఉన్న ప్రదేశాల్లో క ల్సుకునే వాళ్ళం.

అయితే, అరకు రాణిలా అమలినంగా ఉన్న వరాలమ్మ నన్ను మీద చెయ్యి వెయ్యనిచ్చేది కాదు, ఇక శృంగారం అనే ఊహ ఆమెకి వచ్చేది కాదు. ఆ పెద్ద పెద్ద కళ్ళతో నా అందాల్ని చూస్తూ ఉండిపోయేది. అసలు నన్ను చూడ్డానికే అంత రిస్కు తీసుకుని వచ్చేదట.

ఒకరోజు నేను ఇక తట్టుకోలేక ఆ మనిషిని లోబరుచుకునే ప్రయత్నం చేసి చివరికి నెగ్గాను. మర్నాడు వరాలమ్మ ఆత్మహత్య చేసుకుంది.

ఇక అక్కడుండటం కష్టమయ్యి మదనపల్లి వెళ్ళిపోయాను అని కళ్ళు మూసుకున్నాడు. మూసిన కంటి రెప్పల పక్కనించి నీళ్ళ తడి కనిపించింది మాకు.

కాస్సేపాగి మళ్ళీ మొదలెట్టాడు. "ఆ మదనపల్లి కాలేజీలో చదువుకునే ఒక అమ్మాయి వద్దు వద్దంటుంటే నువ్వే కావాలని మీద పడేది. తప్పించుకోడానికి అష్టకష్టాలూ పడాల్సొచ్చేది నేను" అనాగేడు.

* * *

ఆరోజు పౌర్ణమి.

రామచంద్రపురంనించి అద్దెకి తెచ్చిన పెట్రోమాక్సులైట్ల వెలుగుతో కళకళ్ళాడిపోతుంది.

చింతావారితోట. ఊళ్ళో సగం మంది జనం ఆ తోటలోనే ఉన్నారు. దూరం దూరంగా పేకాడే గుంపులు. వాళ్ళలో కొందరు

డంకాపలాసు ఆడతన్నారు. ఒకడయితే మేళంలోంచి పిల్లని పిల్చి తన ఒళ్ళో కూర్చోబెట్టుకుని ఆటలో డబ్బులొచ్చినప్పుడల్లా పదినోటు ఆ మనిషి జాకెట్లో పెడ్తన్నాడు. సరే, ఇంకో పక్క జూస్తే కిళ్ళీరన్న వండుతున్న వంటల ఘుమఘుమలు. మరో పక్క తాగుతున్న జనం కేకలు. అన్నిటికంటే గొప్ప విషయం ఏంటంటే జనాన్ని రెచ్చగొట్టేస్తున్న భోగం మేళం. మేళం నాయకురాలు పచ్చి బూతు పాటల్ని పాడ్తుంటే రెండు డ్రాములు బిగించి గోధుమరంగు మఫ్లరు చెవుల దగ్గర బిగించిన హార్మోనిస్టు భద్రం వేళ్ళు హార్మోనీ మెట్ల మీద డాన్సింగ్ చేస్తున్నాయి. తెగ ఊగిపోతా డోలక్ మీద దరువు లేస్తున్నాడు కన్నారావు.

రంజుగా సాగుతున్న మేళం దగ్గర చిన్న ఎత్తున కలకలం రేగింది.

ఎందుకంటే, అప్పటికే నాలుగో పెగ్ బిగించి ఉన్న మాధవరావు కుర్రగేంగు నేసుకుని ఆ పక్క కొస్తున్నాడు.

దూరాన్నించే అతన్ని చూసిన చింతా వెంకటకిష్ణగారు మేళం నాయకురాల్ని పిల్చి స్పీడు స్పీడుగా ఏదో చెప్పేడు ఆ మనిషి చెవిలో. ''అలాగాండి నేనూ జూసుకుంటానులెండి'' అని మేళం మొత్తం మీద అందగత్తె అయిన ఎత్తుగా బలంగా వున్న ముప్పయ్యేళ్ళ అమృతం అనే అమ్మాయి చెవిలో ఏదో చెప్పి దగ్గర కొస్తున్న మాధవరావుని చూపించింది.

అంతే, మాఊరి సంతలో పరుగెడ్తున్న గిత్తలా ఆ జనంలోంచి పరుగెట్టుకెళ్ళిన అమృతం ''నమస్కారం బాయ్యగారూ'' అంటూ మాధవరావు నడుం పట్టేసుకుని అతను వద్దు. వద్దంటున్నా బలవంతంగా చింతచెట్టు వెనక చీకట్లో వున్న బోరింగ్ షెడ్డులోకి లాక్కెళ్ళిపోయి తలుపేసేసింది.

అందరిచూపులూ షెడ్డు మీదికి తిరిగినియ్యి.

పావు గంటయింది.

అరగంటయింది.

ఆయాస పడతా విసుక్కుంటూ బయటికొచ్చిన అమృతం నాయకురాల్ని దగ్గరకి పిల్చి ఒళ్ళు గగుర్పొడిచే నిజం ఒకటి చెప్పింది.

క్షణాల మీద ఈ విషయం తోటలో ఉన్న అందరి చెవిలోనూ పడిపోయింది. చూస్తే మాధవరావు లేడు.

అమృతం నాయకురాలి చెవిలో చెప్పిందేంటంటే

మాధవరావుకి మగతనం లేదట.

విన్న జనం కొయ్యబారిపోయేరు.

తెల్లారింది.

మాధవరావు రాత్రికి రాత్రే ఊరొదిలి వెళ్ళిపోయినట్టు తెల్సింది.

అలా వెళ్ళిపోయిన మాధవరావు మళ్ళీ ఎప్పటికీ మా ఊరు రాలేదు.

ఇది ఏనాటి కథో.

మాఊరోళ్ళే మర్చిపోయుంటారీ పాటికి.

* * *